కెనడా విదేశాంగ మంత్రిగా అనితా ఆనంద్

- మరో ముగ్గురు భారత సంతతి నేతలకు మంత్రివర్గంలో స్థానం
- నియమించిన కెనడా ప్రధాని కార్నీ

ఒట్టావా, మే 14: కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ తన మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించారు. కొత్త మంత్రివర్గంలో భారత సంతతికి చెందిన నలుగురికి స్థానం కల్పించారు. అనితా ఆనంద్‌ను విదేశాంగ శాఖ మంత్రిగా, మణీందర్ సిద్ధూను అంతర్జాతీయ వాణిజ్య శాఖ మంత్రిగా నియమించారు. అమెరికా-కెనడా మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్న ప్రస్తుత పరిస్థితుల్లో వాటి పునరుద్ధరణకు ప్రధాని కార్నీ కీలకమైన శాఖలను వీరిద్దరికీ అప్పగించారు. నేరాలను ఎదుర్కొనేందుకు రాష్ట్ర కార్యదర్శిగా రూబీ సాహ్తోను, అంతర్జాతీయ అభివృద్ధి కోసం రాష్ట్ర కార్యదర్శిగా రణదీప్ సారాయ్‌ను నియమించారు. సీనియర్ రాజకీయవేత్త అయిన ఆనంద్ గతంలో రక్షణ శాఖ మంత్రిగా కూడా పని చేశారు. కెనడా లిబరల్ పార్టీకి చెందిన 58 ఏండ్ల అనితా ఆనంద్ హిందువుల పవిత్ర గ్రంథమైన భగవద్గీతను చేతపట్టి ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిన్ ట్రూడో ప్రధాని పదవికి రాజీనామా తర్వాత అనితా ఆనంద్ కూడా ప్రధాని పదవికి పోటీపడ్డారు. అనంతరం ఆమె రేసు నుంచి తప్పుకున్నారు. అనితా ఆనంద్ తల్లిదండ్రులు 1960లలో భారత్ నుంచి కెనడాకు వెళ్లి స్థిరపడ్డారు. వ్యాపారవేత్త అయిన 41 ఏండ్ల సిద్ధూ 2019 నుంచి బ్రాంప్టన్ ఈస్ట్ ఎంపీగా వ్యవహరిస్తున్నారు.

వహ్వా.. అనలెమ్మా!

ఆకాశం నుంచి వేలాడే బహుళ అంతస్తుల భవనం

- అస్టరాయిడ్ సాయంతో వేలాడేలా భారీ నిర్మాణం
- సూర్యుడి నుంచి విద్యుత్తు, మేఘాల నుంచి నీరు
- ఒకచోటు నుంచి మరో చోటుకి సులభ ప్రయాణం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): శాస్త్ర సాంకేతిక రంగం కొత్త పుంతలు తొక్కుతున్న నేటి కాలంలో ఎన్నో అద్భుత నిర్మాణాలు కండ్లముందు కనిపిస్తున్నాయి. అయితే, ఇప్పుడు చెప్పబోతున్న నిర్మాణం 'అంతకు మించి' అనేలా ఉంటుంది. ఎందుకంటే ఈ భవంతి భూమి మీదనో, సముద్రం మీదనో లేక చంద్రమండలం మీదనో నిర్మించేది కాదు.. ఆకాశంలో! అవును. దాని పేరే 'అనలెమ్మా టవర్'

ఏమిటీ టవర్?

అమెరికాలోని న్యూయార్క్‌కు చెందిన క్లౌడ్ ఆర్కిటెక్చర్ ఆఫీస్ అనే నిర్మాణ సంస్థ 'అనలెమ్మ' టవర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చింది. జియోసింక్రోనస్ ఆర్బిట్‌లో భూమి చుట్టూ తిరిగే ఓ అస్టరాయిడ్‌ను ఆధారంగా చేసుకొని ఈ భవంతిని ఆకాశంలో బలమైన కేబుల్స్ సాయంతో వేలాడదీస్తారు. తొలుత దుబాయ్ మీదుగా ఈ టవర్‌ను నిర్మించనున్నారు. అస్టరాయిడ్ కదలికకు అనుగుణంగా ఈ టవర్ ప్రపంచంలోని ఉత్తర, దక్షిణార్ధ గోళాలను '8' అనే ఆకారంలో చుట్టి వచ్చి అస్టరాయిడ్ వేగాన్ని బట్టి నిర్ణీత వ్యవధిలో మళ్లీ దుబాయ్‌కు చేరుకొంటుంది.

ఈ టవర్ ఎందుకు?

ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణాలకు, సరుకుల రవాణాకు ఈ టవర్ ఉపయోగపడనున్నది. సోలార్ బేస్డ్ ప్యానల్స్ ఈ టవర్ మొత్తానికి విద్యుత్తును అందిస్తాయని, మేఘాల నుంచి నీటి సరఫరా ఉంటుందని, పర్యావరణ కాలుష్యం అనే విషయమే ఉండదని కాన్సెప్ట్ సృష్టికర్తలు చెప్తున్నారు.

ఎందుకు ఈ పేరు పెట్టారు?

ఒకే సమయం, ఒకే ప్రాంతంలో ప్రతీ రోజూ నిలబడి ఏడాది పాటు సూర్యుడి గమనాన్ని పాయింట్ల రూపంలో గ్రాఫ్ పేపర్ మీద గుర్తిస్తే, ఆ పాయింట్లతో '8' ఆకారం రూపొందుతుంది. అంటే ఆ '8' ఆకారం భూమి పూర్తి పరిభ్రమణాన్ని సూచిస్తుంది. తాజాగా నిర్మించబోయే 'అనలెమ్మ' భవనం కూడా '8' ఆకారంలో తిరుగుతూ.. ప్రారంభమైన చోటుకే తిరిగి వస్తుంది. అందుకే దీనికి ఆ పేరు పెట్టారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడి.. 70 మంది మృతి

- వీరిలో 22 మంది చిన్నారులు

గాజా స్ట్రిప్: గాజాపై వైమానిక దాడులతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఈ దాడిలో 22 మంది చిన్నారులు సహా 70 మంది ప్రాణాలు కోల్పోయారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సౌదీ పర్యటనలో ఉండగానే ఇజ్రాయెల్ ఈ దాడులకు పాల్పడటం గమనార్హం. అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం హమాస్ ఒక ఇజ్రాయెల్-అమెరికన్ బందీని విడుదల చేసిన మరుసటి రోజే ఇజ్రాయెల్ ఈ దాడులకు పాల్పడింది. కాగా, మంగళవారం ఇజ్రాయియెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మాట్లాడుతూ.. గాజాలో తమ యుద్ధాన్ని ఆపడానికి ఎటువంటి మార్గాలు లేవని పేర్కొనడంతో కాల్పుల విరమణపై అవకాశాలు సన్నగిల్లాయి.

మైక్రోసాఫ్ట్‌లో 6 వేల మంది ఉద్యోగులపై వేటు

న్యూఢిల్లీ, మే 14: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మళ్లీ లేఆఫ్‌లను ప్రకటించింది. కంపెనీ ఉద్యోగుల్లో 3 శాతం మందిని, అంటే దాదాపు 6 వేల మందిని తొలగించనున్నట్టు వెల్లడించింది. కంపెనీ చరిత్రలో ఇది రెండో అతిపెద్ద తొలగింపు ప్రక్రియ. అలాగే కంపెనీలో సంస్థాగత మార్పులకూ మైక్రోసాఫ్ట్ శ్రీకారం చుడుతున్నది. రీహైరింగ్ ప్రక్రియలోనూ కీలక మార్పులు తీసుకొస్తున్నది. పోటీ ప్రపంచంలో ఉన్నతస్థానంలో నిలవాలంటే ఇలాంటి మార్పులు తప్పవని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.

తొలిసారి గ్రామీణ ప్రాంతాలకూ ఉపాధి సర్వే

న్యూఢిల్లీ, మే 14: ఉపాధి గణాంకాల సేకరణ, విడుదలలో భారీ మార్పులను కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వశాఖ(ఎంఓఎస్‌పీఐ) తీసుకువచ్చింది. మొట్టమొదటిసారి త్రైమాసిక ఉపాధి గణాంకాల సేకరణను గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిచండంతోసహా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే(పీఎల్‌ఈఎస్)లో అనేక కీలక మార్పులు చేసినట్లు మంత్రిత్వశాఖ బుధవారం ప్రకటించింది. 2025 సంవత్సరం ఏప్రిల్-జూన్‌కు చెందిన త్రైమాసిక ఉపాధి వివరాలను ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేయనున్నట్లు తెలిపింది.

పిల్లల్ని సాకేందుకు ఉద్యోగం మానేసిన భార్య భరణానికి అర్హురాలే

- ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ: పిల్లల సంరక్షణ కోసం భార్య తాను చేస్తున్న ఉద్యోగాన్ని మానేసినప్పటికీ, ఆమె భర్త నుంచి భరణం పొందేందుకు అర్హురాలేనని ఢిల్లీ హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ పరిస్థితిని పిల్లల పెంపకం కోసం అత్యున్నత కర్తవ్య నిర్వహణ బాధ్యతకు పర్యవసానంగా చూడాలని తెలిపింది. ఆమె బుద్ధిపూర్వకంగా ఉద్యోగాన్ని వదులుకున్నట్లు పరిగణించకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ స్వరణ కాంత శర్మ ఈ నెల 13న ఈ తీర్పు చెప్పారు. భార్యకు, మైనర్ కుమారునికి తాత్కాలిక పోషణ భత్యాన్ని మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయడానికి తిరస్కరించారు. ట్రయల్ కోర్టు 2023 అక్టోబరులో ఇచ్చిన తీర్పులో, భార్యకు, కుమారునికి నెలకు చెరొక రూ.7,500 చెల్లించాలని ఆదేశించింది. భార్యకు నెలకు రూ.7,500 చొప్పున, కుమారునికి నెలకు రూ.4,500 చొప్పున తాత్కాలిక పోషణ భత్యాన్ని చెల్లించాలని చెప్పింది. మైనర్ బాలుని పోషణ బాధ్యత అతనిని స్వాధీనంలో ఉంచుకున్న భార్య లేదా భర్తపైనే ఉంటుందని తెలిపింది. అటువంటి భార్య లేదా భర్త పూర్తి కాలం ఉద్యోగం చేయగలిగే సామర్థ్యం పరిమితమవుతుందని పేర్కొంది. తల్లి ఉద్యోగం కోసం వెళ్లినపుడు, బాలుని సంరక్షణ బాధ్యతను చూసుకోవడానికి కుటుంబం సహకారం లేనపుడు, ఆమె ఉద్యోగం చేసే సామర్థ్యం తగ్గిపోతుందని వివరించింది.

నర్సులు, టీచర్లకు యూఏఈ గోల్డెన్ వీసా

- దుబాయ్‌లో 15 ఏళ్లకుపైగా అనుభవం ఉన్నవారికి శుభవార్త

దుబాయ్ : నర్సులకు పదేళ్ల గోల్డెన్ వీసా ఇవ్వనున్నట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఈ నెల 12న ప్రకటించింది. దుబాయ్ హెల్త్ శాఖలో 15 సంవత్సరాలకుపైగా పని చేసిన అనుభవం కలవారికి ఈ వీసాను ఇస్తామని తెలిపింది. ఎంపిక చేసిన విదేశీయులకు 10 ఏళ్ల రెసిడెన్సీని ఇచ్చే గోల్డెన్ వీసా పథకాన్ని 2019లో ప్రారంభించారు. విద్య, వైద్య రంగాల్లో క్వాలిఫైడ్ ప్రొఫెషనల్స్; పెట్టుబడిదారులు, ఔత్సాహిక పారిశ్రమికవేత్తలు; సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మక పరిశ్రమలు, గేమింగ్ వంటి రంగాల్లో పని చేసే నైపుణ్యంగల కార్మికులు ఈ వీసాను పొందవచ్చు. పదేళ్ల గోల్డెన్ వీసా పథకాన్ని టీచర్లు, విద్యావేత్తలకు కూడా వర్తింపజేస్తామని విజ్ఞానం, మానవాభివృద్ధి సంస్థ ప్రకటించింది. దుబాయ్‌లోని ప్రైవేట్ ఎడ్యుకేషన్ ప్రొఫెషనల్స్‌కు ఇది వర్తిస్తుందని తెలిపింది. శిశు సంరక్షణ కేంద్రాలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలలో పని చేస్తూ, అద్భుతమైన పనితీరు కనబరచిన, విద్యా ప్రమాణాలను పెంచినవారికి గోల్డెన్ వీసా ఇస్తామని చెప్పింది.

బీరుపై మళ్లీ బాదుడు

సుంకం పెంపునకు కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం

బెంగళూరు: కాంగ్రెస్ పాలిత కర్ణాటక ప్రభుత్వం బీరు ప్రియులపై మరింత భారం మోపింది. తాజాగా బీరుపై అదనపు ఎక్సైజ్ సుంకం 5 శాతం పెంచుతూ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీంతో ఈ సుంకం 195 శాతం నుంచి 200 శాతానికి పెరిగింది. చౌక ఐఎంఎల్ బ్రాండ్లపై 180 ఎంఎల్‌కు రూ.15 నుంచి రూ.20 వరకు పెరగవచ్చు. మొదట్లో ఈ సుంకాన్ని 10 శాతం మేరకు పెంచాలని ప్రతిపాదించారు. దీనిపై కర్ణాటక వైన్ మర్చంట్స్ అభ్యంతరం తెలిపారు. సిద్ధరామయ్య ప్రభుత్వం ధరలను పెంచడం రెండేళ్లలో ఇది నాలుగోసారి.

52వ సీజేఐగా జస్టిస్ గవాయ్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి...

కొనసాగనున్న గవాయ్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ప్రమాణం చేయించారు. మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన గవాయ్ సామాన్య స్థితి నుంచి అత్యున్నత న్యాయమూర్తి పదవికి ఎదిగారు. రాష్ట్రపతి ప్రమాణం చేసిన వెంటనే జస్టిస్ గవాయ్ తన తల్లి కమల్‌బాయ్ తాయి పాదాభివందనం చేశారు. నవంబర్ 24, 1960లో జన్మించిన గవాయ్ తండ్రి ఆర్ఎస్ గవాయ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు. జస్టిస్ గవాయ్ 2019, మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియుక్తులయ్యారు. ఆర్టికల్ 370, ఎలక్టోరల్ బాండ్స్, పెద్ద నోట్ల రద్దుపై సంచలన తీర్పులు ఇచ్చిన ధర్మాసనాలలో ఆయన సభ్యుడిగా ఉన్నారు. గత ఆరేండ్లలో అనేక అంశాలపై విచారణ జరిపిన సుమారు 700 ధర్మాసనాలలో జస్టిస్ గవాయ్ సభ్యుడిగా ఉన్నారు. సీజేఐగా ప్రమాణం చేయడానికి ముందు తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగమే సుప్రీం అని చెప్పారు. రిటైర్మెంట్ తరువాత ఎటువంటి పోస్టులు చేపట్టబోనని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370 రద్దు చేయాలన్న కేంద్రం నిర్ణయాన్ని బలపరిచిన ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ సభ్యునిగా ఉన్నారు. ఆయన నవంబర్ 23 వరకు సీజేఐగా కొనసాగుతారు.

యూపీలో సెమీకండక్టర్ ప్లాంట్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని జేవర్ వద్ద రూ.3,706 కోట్ల వ్యయం తో సెమీకండక్టర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనను బుధవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతోపాటు ఆటోమొబైల్స్ తయారీకి అవసరమయ్యే డిస్‌ప్లే డ్రైవర్ చిప్స్‌ను ఉత్పత్తి చేసేందుకు హెచ్‌సీఎల్-ఫాక్స్‌కాన్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నాయి. ఈ ప్లాంట్‌లో 2027 నాటికి ఉత్పత్తి ప్రారంభమవుతుందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.

17 లక్షల కోట్లతో 160 విమానాల కొనుగోలు

- బోయింగ్‌కు ఖతార్ భారీ ఆర్డర్

దోహా, మే 14: చరిత్రలోనే తొలిసారిగా విమానాల తయారీ సంస్థ బోయింగ్ అతిపెద్ద ఆర్డర్‌ను పొందింది. 200 బిలియన్ డాలర్ల (సుమారు రూ.17 లక్షల కోట్లు)తో 160 విమానాల కొనుగోలుకు బోయింగ్‌కు ఖతార్ ఎయిర్‌వేస్ ఆర్డర్‌ను ఇచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం వెల్లడించారు. ఇది బోయింగ్ సంస్థకు లభించిన అద్భుతమైన ఆర్డర్ అని ఆయన ప్రశంసించారు. మూడు మధ్య ప్రాచ్య దేశాల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం రెండో దేశమైన ఖతార్‌లో పర్యటించారు.

యూపీలో బర్డ్ ఫ్లూ కలకలం

- జంతు ప్రదర్శనశాలల మూసివేత

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ కలకలం రేగింది. గోరఖ్‌పూర్‌లోని జంతు ప్రదర్శన శాలలో ఓ పులి బర్డ్ ఫ్లూతో మరణించినట్లు గుర్తించారు. దీంతో ఇటావా జిల్లాలోని సింహాల అభయారణ్యంతోపాటు, రాష్ట్రంలోని అన్ని జంతు ప్రదర్శన శాలల్లోకి వారంపాటు సందర్శకులను అనుమతించరాదని నిర్ణయించారు.

వాణిజ్య

ఎంటార్‌కు 34 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, మే 14: రాష్ట్రానికి చెందిన ఎంటార్ టెక్నాలజీ మరో భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. క్లీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ రంగాల నుంచి రూ.34 కోట్ల విలువైన ఆర్డర్ లభించినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ ఆర్డర్లలో భాగంగా క్లీన్ ఎనర్జీతోపాటు ఏరోస్పేస్ రంగాలకు సంబంధించి ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా సరఫరా చేయాల్సివుంటుందని కంపెనీ ఎండీ పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌లోనే తొమ్మిది యూనిట్లు ఉన్నాయి.

దక్షిణ మధ్య రైల్వే
www.scr.indianrailways.gov.in
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చు.
ఇ-టెండర్ నోటీస్ నెం.లు.C/E.29/Elec/M/SC/12/OSW/OT/2025-26
తేదీ: 12.05.2025
దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారు భారత రాష్ట్రపతి తరపున 03.06.2025న 15.00 గం. వరకు ఇ-టెండర్లు కోరుతున్నారు:
క్ర.సం. 01. టెండర్ నం.: ఇటెండర్ నెం.C/E.29/Elec/M/SC/12/OSW/OT/2025-26, ఇటెండర్ నెం.E-M-SC-12-OT-2025-26, పని పేరు: సికింద్రాబాద్ డివిజన్ ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్: i) కాజిపేట్ జంక్షన్- కాజిపేట్ వద్ద లాకప్, టాయిలెట్స్ మొదలగు వాటితో సహా కొత్త రకం డిజైన్ ఆర్‌పిఎఫ్ పోస్ట్-ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం. ii) వరంగల్- వరంగల్ వద్ద లాకప్, టాయిలెట్స్ మొదలగు వాటితో సహా కొత్త రకం డిజైన్ ఆర్‌పిఎఫ్ పోస్ట్-ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం. iii) వరంగల్- వరంగల్ వద్ద ఫర్నిచర్‌తో 24 బెడ్ల పురుష ఆర్‌పిఎఫ్ బరాక్స్ నిర్మాణం. iv) పర్లి వైజ్యనాథ్- పర్లి ఆర్‌పిఎఫ్ పోస్ట్ వద్ద లాకప్, టాయిలెట్స్ మొదలగు వాటితో సహా కొత్త రకం డిజైన్ ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం. v) బీదర్- బీదర్ ఆర్‌పిఎఫ్ పోస్ట్ వద్ద లాకప్, టాయిలెట్స్ మొదలగు వాటితో సహా కొత్త రకం డిజైన్ ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం. vi) రామగుండం- రామగుండం వద్ద లాకప్, టాయిలెట్స్ మొదలగు వాటితో సహా కొత్త రకం డిజైన్ ఆర్‌పిఎఫ్ పోస్ట్-ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం. vii) వికారాబాద్- వికారాబాద్ వద్ద కొత్త రకం డిజైన్ ఆర్‌పిఎఫ్ పోస్ట్-ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం. viii) సికింద్రాబాద్- సికింద్రాబాద్ పోస్ట్ వద్ద మహిళా ఆర్‌పిఎఫ్ కొరకు ఫర్నిచర్‌తో 10 బెడ్ల బరాక్స్ నిర్మాణం. ix) హైదరాబాద్- హైదరాబాద్ పోస్ట్ వద్ద మహిళా ఆర్‌పిఎఫ్ కొరకు ఫర్నిచర్‌తో 10 బెడ్ల బరాక్స్ నిర్మాణం. x) సికింద్రాబాద్- సికింద్రాబాద్ వద్ద ఫర్నిచర్‌తో 94 బెడ్ల కొత్త పురుష ఆర్‌పిఎఫ్ బరాక్స్ నిర్మాణం. xi) సికింద్రాబాద్- SC వద్ద డాగ్ కెన్నెల్ కొరకు కొత్త బిల్డింగ్ నిర్మాణం- విద్యుత్ ఏర్పాట్లు. టెండర్ విలువ: రూ.3,05,41,936.73/-, బయానా: రూ.3,02,700.00/-, CTF: రూ.0.00, పూర్తి చేయు కాలం: 6 నెలలు.
సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (ఎమ్)/ సికింద్రాబాద్
A0578
తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి

ఈ పథకాలు.. ప్రత్యేకం గురూ!

స్పెషల్ డిపాజిట్ స్కీములను ప్రకటించిన కెనరా, యూనియన్ బ్యాంక్‌లు

ట్రూఎడ్జ్, వెల్‌నెస్ పేరిట పరిచయం

ఖాతాదారులకు అందే ప్రయోజనాలివే

న్యూఢిల్లీ, మే 14: కష్టమర్లను ఆకట్టుకొనేందుకు ఆయా బ్యాంకులు ఎప్పటికప్పుడు ప్రత్యేక పథకాలతో వస్తున్నాయి. అయితే నిధుల సమీకరణే లక్ష్యంగా ఇటీవలికాలంలో తెస్తున్న ఈ స్పెషల్ స్కీములపై అధిక వడ్డీరేట్లను ఆఫర్ చేస్తుండటం విశేషం. గత ఆర్థిక సంవత్సరం (2024-25) డిపాజిట్లలో వృద్ధి 10.30 శాతంగానే ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2023-24)లో 13.5 శాతంగా ఉండటం గమనార్హం. ఈ క్రమంలో ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) 9-11 మధ్య డిపాజిట్లలో వృద్ధిరేటు ఉండవచ్చని అంచనా. అందుకే స్పెషల్ డిపాజిట్ స్కీములకు బ్యాంకర్లు శ్రీకారం చుడుతున్నారు.

కెనరా, యూనియన్ బ్యాంక్‌లు..

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థలైన కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలూ ప్రత్యేక డిపాజిట్ పథకాలను ప్రకటించాయి. కరెంట్, సేవింగ్స్ ఖాతాదారుల కోసం ప్రత్యేకంగా కెనరా బ్యాంక్ 'కెనరా ట్రూఎడ్జ్' అనే డిపాజిట్ స్కీమును తీసుకొచ్చింది. పలు ఆర్థిక ప్రయోజనాలను దీని ద్వారా అందిస్తున్నది. ఇక యూనియన్ బ్యాంక్ 'యూనియన్ వెల్‌నెస్ డిపాజిట్'ను పరిచయం చేసింది. ఇందులో ఆరోగ్య బీమా తోపాటు ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) లాభాలను డిపాజిటర్లు అందుకోవచ్చు.

కెనరా ట్రూఎడ్జ్

- సంస్థల ప్రత్యేక బ్యాంకింగ్ అవసరాల నుద్దేశించి రూపకల్పన.
- బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం ట్రస్టులు, విద్యా సంస్థలు, సొసైటీలకు ఈ స్కీం అనుకూలం.
- ఖాతాదారులకు వారి మంత్లీ యావరేజ్ బ్యాలెన్స్ (ఎంఏబీ)కు అనుగుణంగా ఆకర్షణీయ శ్రేణిలో ప్రయోజనాలు.
- 375 రోజుల ఫిక్స్‌డ్ కాలపరిమితితో ఈ స్కీంను ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. వార్షిక వడ్డీరేటు 6.75 శాతంగా నిర్ణయించింది. సీనియర్ సిటిజన్లకు మరో అర శాతం అధికంగా వడ్డీ చెల్లించనున్నది.
- కనీసంగా రూ.10 లక్షలు, గరిష్ఠంగా రూ.3 కోట్ల వరకు డిపాజిట్‌కు వీలు.
- 18 ఏండ్ల నుంచి 75 ఏండ్ల లోపు భారతీయులు ఈ డిపాజిట్ స్కీంకు అర్హులు.

యూనియన్ బ్యాంక్

- 375 రోజుల కాలపరిమితితో కూడిన డిపాజిట్లపై 6.75 శాతం వార్షిక వడ్డీ.
- రూ.10 లక్షల నుంచి రూ.3 కోట్ల డిపాజిట్లకు ఈ వడ్డీరేట్లు వర్తించనున్నది.
- ఈ స్కీం కింద రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా కవరేజ్ కూడా కల్పిస్తున్నది.
- ఈ స్కీంతోపాటు రూపే సెలెక్ట్ డెబిట్ కార్డు, టర్మ్ డిపాజిట్లపై రుణాలు తీసుకోనే అవకాశం ఉంటుంది.

కొనసాగుతున్న క్రెటా హవా

టాప్-10 మాడళ్లలో తొలిస్థానంలో హ్యుందాయ్ మాడల్

న్యూఢిల్లీ, మే 14: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ హవా కొనసాగుతున్నది. గత నెలలో దేశవ్యాప్తంగా అమ్ముడైన టాప్-10 మాడళ్లలో మారుతికి చెందిన ఏడు కార్లకు చోటు లభించింది. కానీ, మొదటి స్థానంలో హ్యుందాయ్‌కు చెందిన క్రెటా ఈసారి తొలి స్థానాన్ని దక్కించుకున్నట్టు దేశీయ వాహన తయారీదారుల సంఘం(సియామ్) తాజాగా వెల్లడించింది. టాప్-10 కార్లు, ఎస్‌యూవీలలో 17 వేల యూనిట్లతో క్రెటా తొలి స్థానంలో నిలిచింది. క్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 15,447 యూనిట్లతో పోలిస్తే 10 శాతం పెరిగాయని తెలిపింది. ఆ తర్వాతి స్థానాల్లో మారుతికి చెందిన డిజైర్, బ్రెజ్జా, ఎర్టిగాలకు చోటు లభించగా..మహీంద్రాకు చెందిన స్కార్పియో ఆ తర్వాతి స్థానం లభించింది. టాప్-10 జాబితాలో టాటా మోటార్స్‌కు చెందిన వాహనాలకు చోటు లభించలేదు. గత నెలలో మొత్తంగా 1.60 లక్షల యూనిట్ల ఎస్‌యూవీలు అమ్ముడయ్యాయి.

ఏప్రిల్-2025లో అమ్ముడైన కార్ల వివరాలు

మాడల్	యూనిట్లు	వృద్ధి (%లో)
క్రెటా	17,016	10.16
డిజైర్	16,996	7.40
బ్రెజ్జా	16,971	-1
ఎర్టిగా	15,780	16.51
స్కార్పియో	15,534	4.91
నెక్సాన్	15,457	38.40
స్విఫ్ట్	14,592	256.42
ఫ్రాంక్స్	14,345	0.41
వ్యాగన్ ఆర్	13,413	-24.86
బాలెనో	13,180	-6.19

రూ.2.5-3 లక్షల కోట్లు?

2024-25కుగాను కేంద్రానికి ఆర్బీఐ డివిడెండ్

న్యూఢిల్లీ, మే 14: గత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి రికార్డు స్థాయిలో డివిడెండ్ వెళ్లవచ్చని తెలుస్తున్నది. నిజానికి అంతకుముందు ఆర్థిక సంవత్సరానికి (2023-24) సంబంధించే రికార్డు స్థాయిలో ఆర్బీఐ నుంచి ఖజానాకు డివిడెండ్ చేరింది. మునుపెన్నడూ లేనివిధంగా ఆ ఏడాదికి రూ.2.11 లక్షల కోట్లు చెల్లించింది మరి. మోదీ హయాంలో కేంద్రానికి అత్యధికంగా ఆర్బీఐ మిగులు నగదు నిల్వలు చేరింది కూడా అప్పుడే. అయితే ఈసారి అంతకుమించి డివిడెండ్ సొమ్ము కేంద్రానికి అప్పగించే యోచనలో ఆర్బీఐ ఉన్నట్టు తెలుస్తున్నది. అదికూడా ఈ నెలలోనే చెల్లింపులు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆల్‌టైమ్ హై..

ఈసారికి రూ.2.5 లక్షల కోట్లు లేదా రూ.3 లక్షల కోట్లదాకా ఆర్బీఐ డివిడెండ్ ఉండవచ్చని అంటున్నారు. గత ఆర్థిక సంవత్సరం డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ తీవ్ర ఒడిదొడుకులకు లోనైంది. డాలర్ ముందు రూపీ క్షీణతను అడ్డుకొనేందుకు కరెన్సీ మార్కెట్లలో ఆర్బీఐ తరచూ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. డాలర్లను అమ్మడం ద్వారా బాగానే రాబడులొచ్చాయి. అలాగే రెపోఆపరేషన్స్‌తో కూడా ఆర్బీఐకి లాభాలు వచ్చాయని కెనరా బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త జీ మాధవన్‌కుట్టి చెప్తున్నారు. అందుకే ఈసారి గత రికార్డును తలదన్నేలా ఆల్‌టైమ్ హై స్థాయిలో డివిడెండ్‌ను చెల్లించాలని ఆర్బీఐ యోచిస్తున్నట్టు సమాచారం. ఇక తమ వద్ద ఉన్న మిగులు నగదు నిల్వల పెట్టుబడులపై వచ్చే ఆదాయం, విలువ మార్పుతో డాలర్ నిల్వలపై పొందే లాభం, కరెన్సీ ముద్రణ నుంచి అందుకునే ఫీజులతోనూ ఆర్బీఐ ఆర్జిస్తున్నది. ఏటా ఇందుకుగాను ప్రభుత్వానికి డివిడెండ్‌ను ప్రకటిస్తూ ఉంటుంది.


మోదీ హయాంలో ఖజానాకు ఆర్బీఐ మిగులు నగదు నిల్వలు (రూ.కోట్లలో)
220000
200000
180000
160000
140000
120000
100000
80000
60000
40000
20000
0
65896
65876
30659
50000
176051
57128
99122
30307
87416
211000
FY